WANTED REPORTERS

నవతరం తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ కావాలన్న కోరిక ఉందా...

ఐతే నవతరం మీ కోసం అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.

వివరాలకు : 9618907705

navataramteugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 207 ఆదివారం, జులై 26, 2026 , పేజీలు - 4 వెల: 5/-

### విద్యార్థులు, జెన్ జీ పోరాటానికి

# ప్రధాని మోదీ తలవంచారు

## విద్యార్థుల విజయాన్ని మా ఖాతాలో వేసుకోం



**హైదరాబాద్, జులై 25:** విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ని ఖండిస్తూ పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు.విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు.విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు.

### ఇందిరమ్మ టవర్స్‌కు

## హెల్ప్‌లైన్ ప్రారంభం



**హైదరాబాద్:** క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు.దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్‌యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ఫ్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు.క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా- విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో ఇది తొలి అడుగు



కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ప్రధాన్ రాజీనామాతో దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన పోరాటాన్ని చూసి గర్విస్తున్నామని అన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువతకు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ, మరో రెండు డిమాండ్ మిగిలే ఉన్నాయని రాహుల్ అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జ్‌పై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు సమయం అసన్నమైందని రాహుల్‌గాంధీ అన్నారు."ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో కీలక ముందడుగు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. కేంద్రం చేతిలో దాడులు, అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదలు- ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి ఇదొక సంకేతం. ఎదిరించి నిలబడటంలోనే ధైర్యం, విజ్ఞత ఉన్నాయి . భయపడకండి, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం. ఇంకా రెండు డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. మొదటిది : విద్యార్థుల వైపు వేలు లెవనెత్తి, వారిని కొట్టిన ప్రతి ఒక్కరినీ బాధ్యులను చేయాలి. రెండోది : కనీస గౌరవంతో విద్యార్థులకు ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి."

### విద్యార్థుల అన్ని డిమాండ్లకు

## కేంద్రం ఓకే



**న్యూ ఢిల్లీ :**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శని వారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థు లపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తా మని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటిం చారు. ఢిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సీజేపీతో చర్చిస్తామని వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సీజేపీ మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు.

### సీజేపీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



**న్యూ ఢిల్లీ :**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు.'విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం'నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగుతున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు.తీవ్రంగా బాధపడ్డా: ధర్మేంద్రగత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. దేశ యువత గందరగోళ పరిస్థితుల్లో చిక్కుకోకుండా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ చదువుపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. నీట్ వివాదాన్ని కొన్ని శక్తులు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. దేశ ఐక్యత, యువత భవిష్యత్తు కాపాడటం అందరి బాధ్యత అని తన రాజీనామా లేఖలో వివరించారు.నాలుగు దశాబ్దాలుగా విద్యా రంగంతో అనుబంధంతన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యా రంగంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలతో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బలమైన దేశానికి బలమైన విద్యా వ్యవస్థ పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని చెప్పారు. నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు బయటపడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించిందని ప్రధాన్ తెలిపారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, పరీక్షను రద్దు చేయడం, తిరిగి పరీక్ష నిర్వహణకు తేదీ ప్రకటించడం వంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.'లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం'నీట్ పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం వివిధ సంఘాలు కూడా ఉద్యమించాయి.

### తాగునీటి సమస్య పరిష్కారానికి 100 రోజుల

## యాక్షన్ ప్లాన్ సిద్ధం



**హైదరాబాద్, జులై 25:** మిషన్ భగీరథపై మంత్రి సీతక్క (శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలు రాకుండా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉందన్నారు. సింగూరు, పాలేరు నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజువారీ రిజర్వాయర్ల నీటిమట్టాలను సమీక్షించాలని సూచించారు. స్థానిక నీటి వనరులను వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవ ంతం చేయాలని తెలిపారు.గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులతో నీటి సరఫరాపై సమాచా రం అందించాలని మంత్రి సూచనలు చేశారు. మహిళా సంఘాలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి ఇబ్బం దులురాకూడదనిమంత్రి సీతక్క స్పష్టం చేశారు.

### మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో మంత్రి

## తుమ్మల భేటీ.



**హైదరాబాద్:** తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు.డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

### దేశంలోని యువతకు ఇది

## ఒక గొప్ప విజయం



**హైదరాబాద్:**నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు.తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' (+వఅ-) టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.

# రహదారుల నరమేధం: ఏటా 1.83 లక్షల ప్రాణాలు బలి

**1. గణాంకాలు చెబుతున్న భయానక నిజాలు**
**2. మానవ తప్పిదం ం వ్యవస్థ వైఫల్యం = మృత్యు ఒడ్డు**
**3. విచ్ఛిన్నమవుతున్న సామాజిక బంధాలు, కుటుంబాల కన్నీళ్లు**
**4. అంతర్జాతీయ సంస్కరణల నుంచి మనం నేర్చుకోవాల్సింది**
**5. పరిష్కారం ఏమిటి? బాధ్యత ఎవరిది?**



ప్రముఖ సామాజికవేత్త డా. నిమ్మాన దాస్ తో నవతరం పత్రిక ప్రతినిధి ఇంటర్వ్యూదేశంలో రహదారి ప్రమాదాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ తాజా లెక్కల ప్రకారం గత ఏడాది ఒక్క సంవత్సరంలోనే 1.83 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇది అంతకు మునుపటి ఏడాదితో పోలిస్తే 3.5 శాతం అధికం. వేగంగా విస్తరిస్తున్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల మధ్య ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఈ దుస్థితిపై సామాజికవేత్త డా. నిమ్మాన దాస్ నవతరం పత్రిక ప్రతినిధి సుదీర్ఘంగా మాట్లాడారు.

ప్ర: సర్, రహదారి ప్రమాదాలను మీరు "నరమేధం" అని అన్నారు. ఇంత కఠినమైన పదం ఎందుకు వాడారు?

డా. నిమ్మాన దాస్: ఎందుకంటే ఇది సాధారణ ప్రమాదం కాదు. ప్రతిరోజు సగటున 500 మంది చనిపోతున్నారు. ప్రతి 3 నిమిషాలకు ఒకరు. ఒక చిన్న యుద్ధంలో చనిపోయే కంటే ఎక్కువ మంది. ఇందులో 60 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల యువత. ఇంటికి పెద్ద కొడుకు, కొత్తగా పెళ్లైన భర్త, చదువుకుంటున్న విద్యార్థి. వీళ్లు చనిపోతే ఒక కుటుంబం మొత్తం రోడ్డున పడుతుంది. ఆర్థికంగా, మానసికంగా చితికిపోతుంది. ఇది దైవ నిర్ణయం కాదు. 90 శాతం ప్రమాదాలు మనిషి తప్పిదం వల్లనే జరుగుతాయి. మిగిలిన 10 శాతం వ్యవస్థ తప్పిదం. లైసెన్స్ అమ్మడం, లోపభూయిష్ట రోడ్లు వేయడం, బ్లాక్ స్పాట్లను సంవత్సరాల తరబడి వదిలేయడం – ఇవన్నీ కలిస్తే ఇది నరమేధం కాక మరేమిటి?

ప్ర: కిందటేడాది గణాంకాలు ఏమి చెబుతున్నాయి?

డా. నిమ్మాన దాస్: కిందటేడాది ఉత్తర్ ప్రదేశ్ లో అత్యధికంగా 27,550 మంది, ఆంధ్రప్రదేశ్ లో 8,327 మంది, తెలంగాణలో 7,566 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. గడచిన రెండు దశాబ్దాల్లో ప్రమాదాల సంఖ్య దాదాపు 10 శాతం పెరిగితే, మరణాలు మాత్రం 80 శాతం పెరిగాయి. అంటే ఒకే ప్రమాదంలో ఎక్కువ మంది చనిపోతున్నారు. మొత్తం రోడ్లలో జాతీయ రహదారుల వాటా కేవలం 2 శాతమే అయినా, మూడోవంతు మరణాలు ఇక్కడే జరుగుతున్నాయి. ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం ఆర్థికంగా చితికిపోతోంది.

ప్ర: రహదారి ప్రమాదాల వల్ల సామాజిక బంధాలపై, కుటుంబాలపై ఎలాంటి భారం పడుతోంది?

డా. నిమ్మాన దాస్: ఇదే అసలు విషాదం. ఒక కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే ఆ ఇంటి గొడుగు ఊడిపోయినట్టే. భార్య వితంతువు అవుతుంది, పిల్లలు అనాథలవుతారు. ఉన్న ఒక్క సంపాదన ఆగిపోతుంది. అప్పులు, ఈఎమ్ఐ లు, పిల్లల చదువులు, ఇంటి బాధ్యతలు అన్నీ ఒకేసారి ఆ భార్యపై పడతాయి.

చాలా కుటుంబాలు వీధిపాలు అవుతున్నాయి. ఇల్లు అమ్ముకోవడం, పిల్లలను స్కూల్ నుంచి తీసేయడం, కూలీకి వెళ్లడం తప్ప వేరే దారి ఉండటం లేదు. ఒక ప్రమాదం 4 తరాలను నాశనం చేస్తోంది. తల్లిదండ్రులు తమ కొడుకును కోల్పోతున్నారు, భార్య భర్తను కోల్పోతోంది, పిల్లలు తండ్రిని కోల్పోతున్నారు. ఈ మానసిక గాయం జీవితాంతం తీరదు.

సామాజికంగా చూస్తే, ఈ నష్టం కేవలం ఆ కుటుంబానికే కాదు. దేశం తన ఉత్పాదక శక్తిని కోల్పోతోంది. ఒక ఇంజినీర్, ఒక టీచర్, ఒక రైతు రోడ్డుపై చనిపోతే వారి సేవలు సమాజానికి అందకుండా పోతున్నాయి. ఆసుపత్రుల్లో గాయపడిన వారికి చికిత్స కోసం వేల కోట్లు ఖర్చు. బీమా కంపెనీలపై భారం. ఇది ఒక గొలుసుకట్టు విధ్వంసం.

ప్ర: రహదారి ప్రమాదాల నివారణకు అంతర్జాతీయ స్థాయిలో ఏమైనా విజయవంతమైన సంస్కరణలు ఉన్నాయా?

డా. నిమ్మాన దాస్: ఉన్నాయి. ప్రపంచంలో కొన్ని దేశాలు ఈ విషయంలో అద్భుతాలు చేశాయి. మనం వాటి నుంచి తప్పకుండా నేర్చుకోవాలి. 3 ప్రధాన సంస్కరణలు చెబుతాను.

మొదటిది – స్వీడన్ "విజన్ జీరో" విధానం: 1997 లో స్వీడన్ "రోడ్డుపై ఒక్క మరణం కూడా ఉండకూడదు" అనే లక్ష్యంతో ఈ విధానం తెచ్చింది. మనిషి తప్పు చేసినా ప్రాణం పోకుండా ఉండేలా రోడ్డు డిజైన్, కార్ల డిజైన్ మార్చారు. నగరాల్లో స్పీడ్ లిమిట్ 30 కి.మీ.కు తగ్గించారు. ఫలితంగా ప్రపంచంలోనే అతి తక్కువ మరణాలు అక్కడే ఉన్నాయి.

రెండోది – జపాన్ మోడల్ కఠిన లైసెన్స్ ం భారీ జరిమానాలు: జపాన్ లో లైసెన్స్ కోసం 60 గంటల శిక్షణ తప్పనిసరి. ఖర్చు కూడా 2 లక్షల వరకు అవుతుంది. మద్యం తాగి డ్రైవ్ చేస్తే 5 లక్షల రూపాయల జరిమానా ం జైలు. సీట్ బెల్ట్, ఫోన్ కు కూడా భారీ జరిమానా. పాఠశాల స్థాయి నుంచే 10 ఏళ్ల పాటు ట్రాఫిక్ విద్య. అందుకే అక్కడ క్రమశిక్షణ ఎక్కువ.

మూడోది – యూకే, ఆస్ట్రేలియా ఆటోమేటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్: ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలో ప్రతి రహదారిపై స్పీడ్ కెమెరాలు, రెడ్ లైట్ కెమెరాలు. వేగంగా వెళ్తే నేరుగా ఇంటికి చలాన్ వస్తుంది. పాయింట్లు కట్ అయి 12 పాయింట్లు పూర్తయితే లైసెన్స్ రద్దు. ప్రమాదం జరిగిన 10 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చే "గోల్డెన్ అవర్" వ్యవస్థ కూడా ఉంది.

ఈ మూడు మన దేశంలో అమలు చేస్తే 50 శాతం ప్రమాదాలు తగ్గుతాయని నా నమ్మకం.

ప్ర: ప్రమాదాలు మూల కారణం ఏమిటి? డ్రైవర్లదా? వ్యవస్థదా?

డా. నిమ్మాన దాస్: రెండూ. కానీ 70 శాతం బాధ్యత వ్యవస్థదే. మానవ తప్పిదాల విషయానికి వస్తే మద్యం తాగి డ్రైవింగ్, 120 కిలోమీటర్ల వేగం, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, నిద్రమత్తు. సరైన శిక్షణ లేకుండా 18 ఏళ్ల పిల్లాడి చేతికి 200 సిసి బైక్ ఇవ్వడం. లైసెన్స్ కోసం ఆర్టీఓ ఆఫీసు చుట్టూ తిరగకుండా బ్రోకర్లకు డబ్బు ఇవ్వడం. వ్యవస్థ వైఫల్యం విషయంలో దేశంలో 16 వేలకు పైగా బ్లాక్ స్పాట్లు గుర్తించారు. వాటిలో సగం చోట్ల కూడా పని పూర్తి కాలేదు. రోడ్డు డిజైన్ లోపాలు, సైన్ బోర్డులు లేకపోవడం, రాత్రిపూట రిఫ్లెక్టర్లు లేకపోవడం. ప్రమాదం జరిగిన తర్వాత బాధితుడిని గోల్డెన్ అవర్ లో ఆసుపత్రికి చేర్చే వ్యవస్థ లేదు. ట్రామా కేర్ సెంటర్లు కాగితాలకే పరిమితం.

ప్ర: ప్రపంచంతో పోలిస్తే మన దేశ పరిస్థితి ఎలా ఉంది?

డా. నిమ్మాన దాస్: చాలా దారుణంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం గత 10 ఏళ్లలో ప్రపంచంలో రోడ్డు మరణాలు 5 శాతం తగ్గాయి. మన దేశంలో 15 శాతం పెరిగాయి. ఈ కారణంగా భారత్ ఏటా తన జీడీపీలో 3 శాతాన్ని కోల్పోతోంది. వైద్య ఖర్చులు, ఉత్పాదకత నష్టం, కుటుంబాల ఆర్థిక భారం కలిపితే ఇది వేల కోట్ల నష్టం. 1975 లో అత్యవసర పరిస్థితిని ప్రజలు ఓటుతో ఓడించారు. ఇప్పుడు ఉన్నది అప్రకటిత అత్యవసర పరిస్థితి. ఇక్కడ లాఠీ లేదు, కానీ నిర్లక్ష్యం ఉంది. "రోడ్డు ప్రమాదం అంటే సాధారణమే" అనేలా మనల్ని తయారు చేశారు.

ప్ర: ఈ నరమేధాన్ని ఆపేందుకు తక్షణం ఏమి చేయాలి?

డా. నిమ్మాన దాస్: ప్రభుత్వం, ప్రజలు ఇద్దరూ బాధ్యత తీసుకోవాలి.

ప్రభుత్వం చేయాల్సింది:
1. లైసెన్స్ ం ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్కరణ – జపాన్, యూకే మోడల్ లాగా కఠిన డ్రైవింగ్ టెస్ట్. ప్రతి హైవేపై స్పీడ్ కెమెరాలు, ఆటోమేటిక్ చలాన్. పదేపదే తప్పు చేస్తే లైసెన్స్ రద్దు.
2. రహదారి ం అత్యవసర సేవలు – స్వీడన్ "విజన్ జీరో" లాగా 6 నెలల్లో అన్ని బ్లాక్ స్పాట్ల మరమ్మతు. లోపభూయిష్ట రోడ్లు వేసిన వారిపై కేసు. ప్రతి 50 కి.మీ.కి ట్రామా కేర్ సెంటర్.
3. సామాజిక భద్రత – ప్రమాదంలో కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, పిల్లల చదువుకు స్కాలర్‌షిప్ ఇవ్వాలి. క్లెయిమ్ లు 15 రోజుల్లో పూర్తి చేయాలి.
4. అవగాహన – పాఠశాల స్థాయి రోడ్డు భద్రత పాఠాలు.

ప్రజలు చేయాల్సింది: హెల్మెట్, సీట్ బెల్ట్ – ఇది పోలీసు కోసం కాదు, మీ కోసం. మద్యం తాగితే డ్రైవ్ చేయకూడదు. టాక్సీ బుక్ చేసుకోండి. రోడ్డులో గుంత ఉందా, సైన్ లేదా – ఫోటో తీసి సోషల్ మీడియాలో పెట్టి ప్రశ్నించండి. మౌనంగా ఉండొద్దు.

ప్ర:సమాజంలో భయం, ఉదాసీనతకు దీనికి సంబంధం ఉందా?

డా. నిమ్మాన దాస్: 100 శాతం ఉంది. "అధికారిని అడిగితే ఏమవుతుందో" అనే భయం వల్లనే రోడ్డు బాగోలేదని ఎవరూ ఫిర్యాదు చేయరు. "నా పిల్లాడు తప్పు చేసినా ఏమీ కాదులే" అనే ధైర్యం వల్లనే తల్లిదండ్రులు మైనర్లకు బైక్ ఇస్తున్నారు. అదే సమయంలో "నాకేంటి లే" అనే ఉదాసీనత. పక్కన ప్రమాదం జరిగినా వీడియో తీసి వెళ్లిపోతాం తప్ప సహాయం చేయం. ఈ రెండు మనస్తత్వాలు మారాలి. ప్రశ్నించే సంస్కృతి రావాలి. భయాన్ని ఓడించిన రోజునే సమాజం మారుతుంది.

ప్ర: చివరిగా యువతకు, సామాన్య ప్రజలకు మీ సందేశం?

డా. నిమ్మాన దాస్: మూడు మాటలు మాత్రమే. మొదటిది బాధ్యతగా ఉండండి. బండి నడిపేటప్పుడు మీ వెనుక 4 మంది కుటుంబం ఉందని గుర్తుంచుకోండి. రెండోది ప్రశ్నించండి. మీ ప్రాంతంలో రోడ్డు బాగోలేదా? సంబంధిత అధికారిని అడగండి. ఆర్టీఐ పెట్టండి. భయపడొద్దు.రోడ్డుపై ఎవరైనా ప్రమాదానికి గురైతే వీడియో తీయకుండా 108 కి ఫోన్ చేయండి. గుడ్ సమరిటన్ చట్టం మిమ్మల్ని రక్షిస్తుంది. గుర్తుంచుకోండి. రోడ్లు అభివృద్ధికి చిహ్నం. కానీ ఆ రోడ్లపై ప్రాణాలు పోతుంటే, కుటుంబాలు వీధిపాలు అవుతుంటే ఆ అభివృద్ధికి విలువ లేదు. ప్రజల కోసమే ప్రజాస్వామ్యం. ప్రజల ప్రాణాలే అసలు ప్రాధాన్యత.ఇంటర్వ్యూ చేసినవారు: నవతరం పత్రిక ప్రతినిధి

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఐక్యతకు దక్కిన విజయం

### - తెలంగాణ NSUI రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్



**హైదరాబాద్, నవతరం:** వరుస ప్రశ్నాపత్రాల లీకేజీలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షల నిర్వహణలో ఘోర వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఇది దేశవ్యాప్తంగా పోరాడిన లక్షలాది మంది విద్యార్థుల ఐక్యతకు దక్కిన చారిత్రాత్మక విజయం.అయితే, వ్యక్తి మారినంత మాత్రాన వ్యవస్థ మారదు. పరీక్షల వ్యవస్థలో పూర్తిస్థాయి సంస్కరణలు వచ్చే వరకు మా పోరాటం కొనసాగుతుంది.మా ముఖ్యమైన డిమాండ్లు: ఎన్టీఏ రద్దు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను వెంటనే రద్దు చేసి, దాని స్థానంలో పారదర్శకమైన, న్యాయ పర్యవేక్షణ కలిగిన స్వతంత్ర పరీక్షా మండలిని ఏర్పాటు చేయాలి. జాతీయ పరీక్షల మండలి అయినందున దాంట్లో సభ్యులుగా దేశంలోని 28 రాష్ట్రాల నుండి, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుండి నిజాయితీ కలిగిన అధికారులను సభ్యులుగా నియమించాలి.సిబిఐ విచారణ: పేపర్ లీకేజీ ముఠాలపై మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.కేసుల ఉపసంహరణ: దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు చేసిన విద్యార్థులపై నమోదైన పోలీసు కేసులను వెంటనే ఎత్తివేయాలి.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**తుర్కపల్లి,జూలై 25 ప్రజా అక్షరం న్యూస్** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్ అన్నారు. శనివారం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు చెట్ల పెంపకం ద్వారా స్వచ్ఛమైన గ్వాలి ఆరోగ్యవంతమైన వాతావరణం లభిస్తుందని, భావితరాలకు పచ్చని పకృతిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోనె జహంగీర్ ,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ,ఫీల్డ్ అసిస్టెంట్, కారోబార్ ,గ్రామస్తులు పాల్గొన్నారు

# స్వగృహాలో ఖాళీగా ఉన్న గదులను ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించండి

### - సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్






**హైదరాబాద్, నవతరం:**
రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్యూర్ రీజియన్ లో నివసిస్తున్న ప్రజల కొరకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపట్టిన ప్రభుత్వ పథకం మంచిదని కానీ ఆచరణలో ఇలాంటివి పేద ప్రజలకు అంతగా ఉపయోగపడట్లేదు కాబట్టి పేద ప్రజల నుంచి డబ్బులను ఆశించే బదులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అదేవిధంగా మేడ్చల్ జిల్లా పరిధిలో గతంలో నిర్మించబడి ఎవరికీ కేటాయించని వాంబే గృహాలు మరియు రాజీవ్ గృహాలు లో అనేక వేల ఇండ్లు ఉన్నాయని వాటిని ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల తోటి మొత్తం నిర్మించవచ్చని కావున అలాంటి ఎవరికి కేటాయించబడనీ గృహాలను గుర్తించి వెంటనే అర్హులకు కేటాయించాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. సిపిఐ కుత్బుల్లాపూర్ మండల నాయకత్వంలో గాజులరామారంలోని సర్వేనెంబర్ 79 లో నిర్మించి ఉన్న రాజీవ్ స్వగృహాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా అక్కడ నిర్మాణం పూర్తయి ఎవరికి కేటాయించకుండా ఉన్న గృహాలను మరియు నిర్మాణం కాని వాటిని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని జిల్లాలో ఇలా నిర్మించబడి ఎవరికీ కేటాయించని గృహాలు సుమారు మూడు నాలుగు వేలు ఉండవచ్చని వాటిని గుర్తించి పేద ప్రజలకు కేటాయించాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ భూమిని హెచ్ఎండిఏకి అప్పగించి ఊరుకుండడం వల్ల వేలాది ఎకరాలు అన్యక్రాంతమయ్యాయని అటువంటి భూములను గుర్తించి పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పంచని పక్షంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి మరో భూ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు రాములు, కోశాధికారి సదానంద్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు సిపిఐ నాయకులు మల్లేష్ రమేష్ ఇమామ్ సహదేవరెడ్డి యువజన సంఘం నాయకులు ప్రవీణ్ కీర్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన యెలుగం సత్యనారాయణ



**వరంగల్, విశాలజ్యోతి:** తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ గారిని నూతనంగా ఎన్నిక కాబడిన చేనేత పారిశ్రామిక సంఘ అధ్యక్షులు 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా మంత్రి గారిని కలిసి పూల మొక్కను అందజేసి శాలువా కప్పి మంత్రి గారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. మంత్రిని కలిసిన వారిలో దయనంద చేనేత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు యెలుగం చిన్న భద్రయ్య, మోడల్ చేనేత సంఘం అధ్యక్షులు సింద్దాం వెంకట్రం నర్సయ్య, వినాయక చేనేత సంఘం అధ్యక్షులు యెలుగం రవి రాజ్, మండి బజార్ చేనేత సంఘం అధ్యక్షులు డి ఎస్ మూర్తి, ముక్తిశ్వర చేనేత సంఘం అధ్యక్షులు పరికిపండ్ల రమేష్, మైసమ్మ గుడి చేనేత సంఘం అధ్యక్షులు గుత్తి కొండా తిరుపతి, వజ్ర చేనేత సంఘం అధ్యక్షులు వావిలాల సదానందం, కాకతీయ చేనేత సంఘం అధ్యక్షులు మాచ బత్తుల కొమరస్వామి,ఎల్బీనగర్ చేనేత సంఘం అధ్యక్షులు ఆకునూరి జయరాములు, గిర్మాజీ పేట చేనేత సహకార సంఘం అధ్యక్షులు కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోనం ఎత్తిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

### - అనంతరం బీరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి

**వరంగల్ , విశాలజ్యోతి:**
వరంగల్ నగరంలోని 'ఓ సిటీ' లో శనివారం జరిగిన బీరన్న స్వామి బోనాల కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మాత్యు లు శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఈ ప్రాంతానికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ గారికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు జై కొండా నినాదాలతో హోరెత్తించారు. మహిళలు అభిమానులు మంత్రితో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంత్రి కొండా సురేఖ గారు బోనం ఎత్తుకొని పోచమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ నగర ప్రజలందరికీ పోచమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ పోచమ్మతల్లి అమ్మవారి ఆశీస్సులు నగర ప్రజలందరి పై ఉండాలని మంత్రి సురేఖ గారు ఆకాంక్షించారు..

## ఘనంగా కేటిఆర్ జన్మదిన వేడుకలు:



**చిట్యాల, జూలై 25**
బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10వార్డుకి చెందిన యువ నాయకులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పలకలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలోచింతపల్లి ప్రవీణ్,ఎస్కే ఇబ్రహీం, బొడ్డుపల్లి శ్రీను,సిలివేరు రిశ్వంత్, బొడ్డుపల్లి ఉపేందర్,గూడ అఖిల్, బొడ్డుపల్లి శ్రీశాంత్,ఎస్కే ఉస్మాన్, నరముల శివ, పల్లపు శ్రీకాంత్,తిరు పాల రాంచరణ్,శివాజీ తదితరులు పాల్గొనారు..

## పూరీ బీచ్‌లో అద్భుత సైకత శిల్పం (సాండ్ ఆర్ట్ )తో కేటీఆర్‌కు జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్**




**ఒడిస్సా / హైదరాబాద్, నవతరం:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఒడిశాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పూరీ బీచ్ వద్ద ప్రత్యేక సాండ్ ఆర్ట్‌ను రూపొందించి ఆయనపై ఉన్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. ఈ సైకత శిల్పం ఆర్ట్‌లో కేటీఆర్ చిత్రపటంతో పాటు హ్యాపీ బర్త్ డే కేటీఆర్ అన్నా ఏ50", "ఫ్యూచర్ సీఎం అఫ్ తెలంగాణ " అనే సందేశాలను కళాత్మకంగా ఆవిష్కరించారు. కేటీఆర్ 50వ జన్మదినాన్ని గుర్తుండిపోయేలా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక సాండ్ ఆర్ట్‌ను రూపొందించగా, బీచ్‌కు వచ్చిన పర్యాటకులు, స్థానికులు ఆసక్తిగా వీక్షించి అభినందించారు. పలువురు ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ఈ కళాకృతిని ప్రశంసించారు. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ గారి పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. ఐటీ రంగం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆయన చేసిన కృషి తెలంగాణను దేశవ్యాప్తంగా ప్రత్యేక స్థానంలో నిలిపిందని పేర్కొన్నారు. ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కేటీఆర్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన నాయకత్వం అందించే సామర్థ్యం కలిగిన నాయకుడని అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు అన్ని వర్గాల ప్రజల్లో విశేష ఆదరణ ఉందని తెలిపారు. కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పదవీ విరమణ పొందుతున్న అధికారి కి ఘనంగా సన్మానం



**రామగుండం,జులై 25**
పర్సనల్ విభాగంలో పర్సనల్ మేనేజర్‌గా విశిష్ట సేవలు అందించి ఈ నెల పదవీ విరమణ పొందుతున్న ముప్పిడి రవీందర్ రెడ్డి ని శనివారం పలువురు అధికారులు,ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జీడీకే–-2 ఌ 2ఏ గని అధికారులు, ఉద్యోగులు,కార్మికులు కూడా శాలువాతో సన్మానించి,సంస్థ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అనంతరం సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రరావు,ముప్పిడి రవీందర్ రెడ్డి కి శాలువా కప్పి,జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.వక్తలు మాట్లాడుతూ ముప్పిడి రవీందర్ రెడ్డి ఉద్యోగుల సంక్షేమం,కార్మిక-–యాజమాన్య సంబంధాల మెరుగుదల,సేవా నియమాల అమలు, సమస్యల పరిష్కారం వంటి అంశాలలో సమర్థవంతంగా పనిచేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.తన సేవా కాలమంతా నిబద్ధత, క్రమశిక్షణ,పారదర్శకతతో విధులు నిర్వర్తించి సహోద్యోగులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.తనకు అందించిన గౌరవానికి స్పందించిన ముప్పిడి రవీందర్ రెడ్డి,తన సేవా కాలంలో సహకరించిన సింగరేణి యాజమాన్యానికి, అధికారులు,ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి. రమేష్ బాబు (స్టాట్యూటరీ మేనేజర్, జీడీకే--2 ఌ 2ఏ), ఎజ్జగిరి శివయ్య (మైన్ మేనేజర్), డి.గణేష్ (వెల్ఫేర్ ఆఫీసర్), దొంత వెంకటేశ్వర్లు (సేఫ్టీ ఆఫీసర్), ఎండి.సల్మాన్ ఖాన్ (సెక్షన్ ఇన్‌చార్జ్), ఆర్.దామోదర్ (సర్వే ఆఫీసర్), ఇతర అధికారులు,పర్సనల్ డిపార్ట్ మెంట్ ఆఫీస్ సుపరింటెండెంట్ దేవాచారి,అన్వేష్ క్లరికల్ సిబ్బంది సహా ఉద్యోగులు,కార్మికులు,కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ప్రజలకు ప్రాణ భయం

**-నాసిరకం రోడ్డు పనుల చేసిన కాంట్రాక్టర్లు సదానందం పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది**
**- సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్**









**కుత్బుల్లాపూర్, నవతరం:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప నుండి డబుల్ బెదురూమ్కు వెళ్లే దారిలో డ్రైనేజ్ పై మూత లేకపోవడం వల్ల అటుగా వెళ్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి వచ్చిన సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని పెట్టి రోడ్లు, డ్రైనేజ్ పైపు లైన్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయిస్తున్న చూస్తున్నారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. గతంలో ఎన్ఆర్ఐ కాలనీలో ఇదే డ్రైనేజ్ కాలవలో పడి ఒక నాలుగు సంవత్సరాల బాలుడు మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే అయినా అధికారులు మొద్దు నిద్ర విడడం లేదు అని గుర్తు చేశారు. అలాగే ఇంద్రన్న కాలనీ లో కూడా డ్రైనేజ్ మూత ఓపెన్ అయి ఉంది. కనుక వర్ష కాలనీ దృష్టిలో పెట్టుకొని వెంటనే డ్రైనేజ్ మూత వేయాలని, ఇలాంటి నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు సదానందం పై క్రిమినల్ కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింగ్, రాజు, సురేష్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి గ్రామంలో ఏకాదశి నగర సంకీర్తన



**తుర్కపల్లి జులై 25** ఈరోజు తుర్కపల్లి గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా పలు వీధులలో హరే రామ హరే కృష్ణ భగవన్నామ స్మరణ చేస్తూ భక్తులు భగవాన్ నామ స్మరాన్ని పులకింపజేశారు ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గనిముక్కుల వెంకట చారి కందుకూరి బాలరాజు కందుకూరి అమర్నాథ్ మడిగే వెంకటస్వామి తిప్పారం నాగేష్ ఆకుల రమేష్ ఆకుల సిద్దు నాగపురి సాయి తేజ గుండెబోయిన రమాకాంత్ పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నార.

## వానాల కోసం ప్రత్యేక పూజలు.

**- సర్పంచ్ ఉప్పరి నరేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం...**



**రాజాపేట జూలై 25**
రాజపేట మండలంలోని కొండ్రెడ్డి చెరువు గ్రామంలో శనివారం సర్పంచ్ ఉప్పరి నరేష్ ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని, పంటలు పండాలని తొలి ఏకాదశి పర్వదినం రోజున గ్రామ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. జల కడవలతో బతకమ్మ ఆటపాటలు ఆడి బొడ్రాయికి అభిషేకాలు చేశారు. రామదేవతలను పూజించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పరి నరేష్, గ్రామ ఉపసర్పంచ్ ఉచ్చంతల కళ్యాణి రాజు, గ్రామ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు.. కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బహిర్గతం

**- మండల అధ్యక్ష పదవి నియామకంపై రెండు వర్గాలుగా చీలిన నాయకత్వం**
**- వేడుకల మధ్యలోనే వెళ్లిపోయిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**
**- 'కేటీఆర్ ముందే తేల్చుకుంటాం' అంటున్న అసంతృప్త వర్గం**




**నవతరం ఖమ్మం భద్రాద్రి జిల్లా:**
అశ్వారావుపేట బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కేటీఆర్ జన్మదిన వేడుకల వేదికగా మండల అధ్యక్ష పదవి వివాదం రగిలిపోవడంతో పార్టీ నాయకత్వం రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితి కనిపించింది. వేడుకల మధ్యలోనే మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అసంతృప్తితో వెళ్లిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలోనే నాయకుల మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం కూడా ఈ విభేదాలు తగ్గకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.మండల అధ్యక్ష పదవి చాలా కాలంగా ఖాళీగా ఉండగా, తాత్కాలికంగా తిరుమలకుంట గ్రామానికి చెందిన జుజ్జూరు వెంకన్నబాబుకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు జూపల్లి రమణారావుకు బాధ్యతలు అప్పగించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రతిపాదించినట్లు సమాచారం.కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని సీనియర్ నాయకుడు కోటగిరి సీతారామస్వామి నివాసంలో సమావేశమైన నాయకుల మధ్య ఈ అంశంపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి ఆర్థికంగా నష్టపోయిన కాసాని వర్గం ఈ ప్రతిపాదనకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో సమావేశంలో వాతావరణం ఉద్రిక్తంగా మారి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అసంతృప్తితో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఇదిలా ఉండగా, "పార్టీలో ఉండేవారు ఉంటారు.. వెళ్లేవారు వెళ్తారు.. రమణారావునే మండల అధ్యక్షుడిగా కొనసాగిస్తాం" అని మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని కాసాని వర్గం ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.మరోవైపు, ఈ వివాదాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించిన కాసాని వర్గం, ఇందుకోసం అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నట్లు ప్రకటించింది. పార్టీ అంతర్గత సమస్యను అధిష్ఠానం ముందే తేల్చుకుంటామని ఆ వర్గం స్పష్టం చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి వెళుతున్న సమయంలో, బీఆర్ఎస్‌లో ఇలాంటి అంతర్గత విభేదాలు కార్యకర్తల ఉత్సాహాన్ని దెబ్బతీస్తున్నాయని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. రానున్న స్థానిక రాజకీయా లపై ఈ పరిణామాలు ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీ య పరిశీలకులు భావిస్తున్నారు. పరిస్థితి మరింత దిగజార కముందే పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకుని విభేదాలకు ముగిం పు పలకాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

# వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోతావ్ అభివృద్ధిలో పోటీపడాలి..

**రాజకీయ కక్ష సాధింపుల్లో మాత్రం కాదు..**
**నీవు బిడ్డలకు కాసుకున్న తల్లివే..**
**బైక్ యాక్సిడెంట్ ను మర్డర్ కేసుగా చిత్రీకరిస్తారా?**
**ప్రజా సమస్యలపై గళం వినిపించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తారా?**




**పలాస:** స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఇదొక రాజకీయ కుట్ర ఆనాడు కింజరాపు ఎర్రన్నాయుడు కారు ప్రమాదంలో మరణిస్తే.. వాహనాన్ని నడిపేది ఎవరో తెలుసా? తిత్లి తుఫాన్ లో పదిమంది యాదవులు చనిపోతే నాటి టిడిపి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఎప్పుడైనా పరామర్శించారా? ఈరోజు పలాసలో విష బీజాలు నాటారు.. భవిష్యత్తులో ఆ ఫలాలు మీకు వర్తించక మానవు. మానవతావాది అయిన డాక్టర్ అప్పలరాజు ను జైలులో పెడితే.. వచ్చే కొత్త ప్రభుత్వంలో రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా నీవు చేసిన అభివృద్ధి ఏమిటో డాక్టర్ అప్పలరాజు చేసిన అభివృద్ధి ఏమిటో మేము చూపిస్తాం.. రాజకీయ కక్షల ఆలోచనలు మానుకొని.. అభివృద్ధిపై దృష్టి సారించు.. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు వైఎస్ఆర్సిపి నేతలు స్ట్రాంగ్ వార్నింగ్ ( పలాస కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు గట్టిగా నిలదీసి ప్రశ్నించే గొంతుకగా ఉన్న వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు ను రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు జరిగిన కుట్రలో భాగమే పలాసలో ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదం కేసులో హత్యా నేరం మోపబడి న సంఘటన దేశ చరిత్రలో ఎక్కడ లేదని వైయస్ఆర్సీపీ పలాస నియోజకవర్గ నేతలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శనివారం పలాసలో వైయస్సార్సీపీ కార్యాలయం ప్రగతి భవన్ వద్ద వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ యాదవ్ నేతృత్వంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎప్పుడు లేని విధంగా పలాస నియోజకవర్గంలో రాజకీయాలను తెలుగుదేశం పార్టీ నేతలు కక్షపూరితంగా రాక్షసత్వం రాజకీయాలు నడిపిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని చెప్పడానికి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు తో పాటు ఆయన కుమారుడు అరవ్ వర్మ ను ఒక రోడ్డు ప్రమాదం కేసులో హత్య నేరం కింద చిత్రీకరించి అక్రమంగా కేసు బనాయించి జైలుకు పంపడం తీరు చూస్తే, ఎంతగా రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని వైయస్సార్సీపి అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. రహదారి ప్రమాదంలో మృతి చెందిన దానయ్య దుర్మరణం చాలా బాధాకరమని, అందుకు వైఎస్ఆర్సిపి తరపున ఆ కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన డాక్టర్ అప్పలరాజు ఒక పేదరిక మత్స్యకార కుటుంబంలో పుట్టి ఒక మంచి హస్తవాసి వైద్యునిగా ఎదిగి స్థిరపడ్డారని, ఆయనకున్న కీర్తి ప్రతిష్టలను గుర్తించి నాడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇచ్చారని, ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహించడమే కాకుండా పలాస నియోజకవర్గం జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. 700 కోట్లతో వంశధార నది నుంచి పలాస తో పాటు ఇచ్ఛాపురం నియోజక వర్గానికి శుద్ధి చేయబడ్డ రక్షిత తాగునీటి జలాలు ఇంటింటా సరఫరా చేసే విధంగా వైయస్సార్ సుజల ధార ప్రాజెక్టు సాధించకుండాలిగారని, అలాగే 70 కోట్ల రూపాయల వ్యయంతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం మరియు 200 పడకల ఆసుపత్రి తీసుకురావడం తోపాటు పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నియోజకవర్గంలో మరికొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు, అనేక ప్రభుత్వ పాఠశాలలు ఆధునికరణ, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కీలక రహదారులు, పలాస రైల్వే వంతెన పనులు పునః ప్రారంభం ఆయన హయాంలోనే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఆయన గొప్ప మానవతావాదని, పలుమార్లు రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు ఆయన స్వయంగా ప్రమాద స్థలానికి చేరుకొని వైద్య సేవలు అందించిన దాఖలాలు కో కొల్లలు అని ఆయన చెప్పారు. అటువంటి వ్యక్తిని రోడ్డు ప్రమాదం జరిగిన కేసు విషయంలో తప్పుదోవ పట్టించి, రాజకీయ కక్షతో జైలుకు పంపించిన తీరు చూస్తుంటే, భవిష్యత్తులో కూడా ఇంకా ఎన్ని నేరాలు, ఘోరాలు చవి చూడవలసి వస్తుందో నన్న ఆందోళన బమ్మిడి దుర్యోధనరావు వ్యక్తం చేశారు. దివంగత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రం నాయుడు ఒక రోడ్డు ప్రమాదంలో మరణిస్తే, ఆ వాహనాన్ని నడిపింది టిడిపి నాయకుడు చౌదరి బాబ్జి కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశం లో వైఎస్ఆర్సిపి సీనియర్ నేత, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ మాట్లాడుతూ, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడు కారు నడుపుతున్నప్పుడు ప్రమాదం జరిగిందని, అప్పుడు ఒక వ్యక్తి మృతి చెందాడని, అలాగే ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ వాహనం కింద ఒక వ్యక్తి మృతి చెందారని, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రమాదాలు జరుగుతుంటాయని, ఇంతకీ డాక్టర్ అప్పలరాజు కుమారుడు బైక్ నడుపుతూ యాక్సిడెంట్ చేసినట్లుగా పోలీసులు పెట్టిన కేసులు న్యాయస్థానాలు విచారించి చర్యలు తీసుకోవాలని, కానీ ఆయన కుమారుడు ఈ ప్రమాదం చేసినట్లుగా సాక్ష్యం లేదని, అటువంటప్పుడు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష లేనిపోని ఆరోపణలు చేయడం సబబుగా లేదన్నారు. ఆమె ఇద్దరు బిడ్డల తల్లిని, డాక్టర్ అప్పలరాజు తోపాటు కుమారుణ్ణి కూడా జైలు పాలు చేసినప్పుడు ఆ కుటుంబ సభ్యులు పడిన ఆవేదన ఏమిటో ఆలోచించి, రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకో పోతే, వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలి పోవాల్సి ఉంటుందని ఆయన హితవు పలికారు. రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు 108 వాహనానికి ఫోను చేయడం ఒక తప్పుగా చిత్రీకరించడం ఎంతవరకు సబబుగా ఉందో ఆలోచించాలన్నారు. రాజకీయాలు చేసేటప్పుడు అభివృద్ధిలో పడాలని తప్ప.. రాజకీయ కక్ష సాధింపు చర్యలతో పోటీ పడకూడదని , అలా పోటీ పడితే ప్రజలు శాశ్వతంగా ఇంట్లో కూర్చో పెడతారని, ఈ రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని, తమ నాయకుడు డాక్టర్ అప్పలరాజు ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ప్రజాదరణతో పాటు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ , ప్రజా సమస్యలపై గట్టిగా ప్రభుత్వాన్ని నిలదీస్తూ, మంచి వక్తగా రాణిస్తున్న డాక్టర్ అప్పలరాజును ఎలాగైనా అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపితే, తమ వ్యూహం ఫలిస్తుందన్న కుట్రలో భాగమే ఈ అక్రమ అరెస్టు అని ఆయన ఆరోపించారు. రహదారి ప్రమాదంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన దానయ్యతో పాటు మరో ప్రమాదంలో మందస మండలం లోహర్ బంధ గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ అనే వ్యక్తి కూడా ఒక తెలుగుదేశం పార్టీ చెందిన నాయకుడు వాహనం కిందపడి మృతి చెందాడని, ఆయన కుటుంబాన్ని కూడా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వాన్ని ఒప్పించి నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ దురుద్దేశంతో రాష్ట్ర మంత్రులు ఈ ఘటనపై రాకపోకలు సాగిస్తున్నారంటే, డాక్టర్ అప్పలరాజు నాయకత్వానికి భయపడి ఎలాగైనా ఆయన్ని రాజకీయంగా అణచివేయాలన్న ఉద్దేశం కనిపిస్తుందని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఏం కావాలన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇప్పటికైనా తమ మైండ్ సెట్ మార్చుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఆమె కొనసాగించిన రాజకీయ కక్షలు పునరావృతం అవుతాయని, అటువంటి విష బీజాలు నాటకుండా, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని, తప్పుడు కేసులు తక్షణం ఉప సంరక్షించుకోపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నేతలు చింతాడ మాధవరావు, తలగాన శ్రీరాములు, బత్తిన హేమశ్వర రావు, ఇప్పిలి నారాయణరావు, సుజాత పండ, కొర్ల సంతోష్ లు పాల్గొన్నారు.

# మక్తల్ సెట్విన్ లో ఘనంగా ఆషాఢ గోరింటాకు సంబురాలు.




**నారాయణపేట, జూలై 25 )**
తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తో ఏర్పాటైన మక్తల్ పట్టణంలోని సెట్విన్ – సాంకేతిక శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆషాఢ గోరింటాకు సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సెట్విన్ లోని కంప్యూటర్ ట్రైనింగ్,బ్యూటీషియన్ , టైలరింగ్, మగ్గం వర్క్ సంబంధించిన విద్యార్థినిలు.. ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్విన్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గోరింటాకు తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఈ మాసంలో మహిళలు ఖచ్చితంగా గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ప్రతి ఏటా గోరింటాకు పండుగను మహిళలు అందరూ ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ ట్రెయినర్లు స్వప్న, ఫర్హానా, మామిళ్ల వీరమ్మ, తిమ్మప్ప, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మి, విద్యార్థినిలు, పాల్గొన్నారు.ం

# ధన్వాడలో ఘనంగా దివంగత జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం జయంతి వేడుకలు

**-- ధన్వాడ నరసింహులు నాయుడు ఆధ్వర్యంలో ఎర్ర సత్యం కు ఘన నివాళులు**



**నారాయణపేట, జూలై 25**
ధన్వాడ ముదిరాజ్ సంఘం సారథ్యంలో శనివారం నాడు దివంగత జడ్చర్ల ఎమ్మెల్యే మరాఠీ సత్యనారాయణ ఎలియాస్ ఎర్ర సత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక బస్టాండ్ దగ్గర ఏర్పాటుచేసిన ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బర్డ్డే కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యం అమరహే అంటూ నినాదాలు చేశారు కార్యక్రమంలో మత్స్యపార్యస్రామిక సహకార సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నీరటి నరసింహనాయుడు అఖిలపక్షం నాయకులు చంద్రశేఖర్ బాల నరసింహులు సచిన్ రవికుమార్ జయప్రకాష్ శివరాములు వెంకట్ రాములు సంద బాలరాజ్ రామాంజనేయులు రాజలింగం జయప్రకాష్ సహకపూర్ మంగలి సత్తయ్య పాల్గొన్నారు.

# ఏకలవ్య జయంతి వేడుకలు

**:- తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఆధ్వర్యంలో**



**రామగుండం,జులై 25**
స్థానిక చంద్రశేఖర్ నగర్ లో పోచమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఆధ్వర్యంలో కేంసారం తిరుపతి రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు ఏకలవ్య జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సార్ల తిరుపతి ఏకలవ్య జయంతి మరియు తొలి ఏకాదశి పండుగ రోజున పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి పిల్లలకు బుక్కులు,పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గం అధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్,లోకిని పరుశు రాం,రేవల్లి కొమరయ్య,లోకిని సమ్మయ్య,కుర్ర భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇది చట్టం కాదు... రెడ్‌బుక్ సెక్షన్లతో సీదిరి కుటుంబంపై రాజకీయ వేట

**- రోడ్డు ప్రమాదాన్ని కక్ష సాధింపు ఆయుధంగా మార్చిన కూటమి ప్రభుత్వం**
**- కల్పబుల్ హోమిసైడ్ సెక్షన్లు, అరెస్టుల వెనుక అసలు కుట్ర ఏంటి?**



**పలాస :** మాజీ మంత్రి, పలాస మాజీ ఎమ్మెల్యే డా. సీదిరి అప్పలరాజు కుటుంబంపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో వ్యవహరిస్తోందని మందస మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఆరోపించారు. శనివారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద ఘటనపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరగాలని, అయితే దర్యాప్తు పేరుతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదానికి బాధ్యులెవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అయితే వాస్తవాలు తేలకముందే తీవ్రమైన అభియోగాలు మోపడం, కుటుంబ సభ్యులను అరెస్టు చేయడం రాజకీయ వేధింపులకు నిదర్శనమని విమర్శించారు. ప్రమాదం జరిగిన ప్రతి కేసును కల్పబుల్ హోమిసైడ్‌గా పరిగణించడం చట్టబద్ధం కాదని, ఉద్దేశం లేదా స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే అలాంటి అభియోగాలు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశాన్ని గుర్తు చేశారు. సీదిరి అప్పలరాజు కుమారుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన అనంతరం, ఇప్పుడు డా. సీదిరి అప్పలరాజును కూడా అరెస్టు చేయడం వెనుక రాజకీయ కక్ష తప్ప మరొక కారణం కనిపించడం లేదని ఆరోపించారు. దర్యాప్తు పూర్తికాకముందే మీడియా ట్రయల్ నిర్వహించి ప్రజల ముందే దోషిగా చిత్రీకరించడం చట్టపాలన కాదన్నారు. రాష్ట్రంలో చట్టం అందరికీ సమానంగా అమలవడం లేదని, అధికార పార్టీ నాయకులకు ఒక న్యాయం, ప్రతిపక్ష నాయకులకు మరో న్యాయం అమలవుతోందని మండిపడ్డారు. టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదాలకు కారణమైతే ఇదే ప్రమాణాలు వర్తింపజేస్తారా అని ప్రశ్నించారు. సామాన్య మత్స్యకార కుటుంబం నుంచి ఎదిగి వైద్యుడిగా, ప్రజాప్రతినిధిగా, మంత్రిగా సేవలందించిన డా. సీదిరి అప్పలరాజును తప్పుడు కేసులతో నేరస్థుడిగా చిత్రీకరించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పోరాడే నాయకులను అక్రమ కేసులతో భయపెట్టలేరని, ప్రతి రాజకీయ వేధింపుకు ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కేసులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించి, రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షులు దల్లి జానకిరెడ్డి, ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, జిల్లా పార్టీ కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, వైఎస్సార్సీపీ నాయకులు అందాల శేషగిరి, సౌర్ర డిల్లీరావు, పితాంబరం, గిన్ని తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్, సీదిరి జగన్ హరికృష్ణ, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు, బత్తిని వెంకట్, గౌరకల కేశవరావు, మాజీ సర్పంచ్‌లు గేదెల పద్మనాభం, గున్న రమణ, గోపాల్, మార్పు కృష్ణ, ఎంపీటీసీలు కంచిబెహార, బురద జగదీష్, గుంపు జగదీష్, శోభన్, గొలుసు చంద్రశేఖర్ తదితరులు.

# నాయి బ్రాహ్మణులను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

**- అమరోజు వెంకన్న నాయి**

**చిట్యాల,జులై 25**



నాయి బ్రాహ్మణ సేవా సంఘం చిట్యాల పట్టణ కమిటీ సమావేశం శనివారం స్థానిక బి.ఎన్.రెడ్డి ఫంక్షన్ హాల్ లో సంఘం పట్టణ అధ్యక్షులు అమరోజు వెంకటేశం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు అమరోజు వెంకన్న నాయి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తరతరాల నుండి కులవృత్తిని నమ్ముకొని పొట్ట చేత పట్టుకొని జీవిస్తున్న నాయి బ్రాహ్మణులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీలకు వర్తించే అన్ని సౌకర్యాలు నాయి బ్రాహ్మణులకు వర్తింపజేయాలని అన్నారు. నాయి బ్రాహ్మణ క్షవరవృత్తిదారులకు 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయి బ్రాహ్మణ కులానికి చెందిన అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మంజూరు చేసి ఇవ్వాలని కోరారు. నాయి బ్రాహ్మణుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అమ రోజు శ్రీరాములు, వావిళ్ళ కృష్ణయ్య, అమరోజు కృష్ణ, జంపాల వెంకన్న, చికిలంమెట్ల అశోక్ చికిలంమెట్ల పాపయ్య, చెన్నారపు నరసింహ, అక్కెనపల్లి అనిల్, అమరోజు మధుసూదన్, అమ రోజు సురేష్, వేముల రమేష్, వేముల యాదగిరి, గడి గల పెద్ద శేఖర్, చికిలం మెట్ల సైదులు, అమ రోజు శివ తదితరులు పాల్గొన్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com